ఓం నమో భగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర

## (చించినాడలో శ్రీనాన్నగారి ప్రవచనము, 7-3-97)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భగవంతునికి రూపంలేదు, నామంలేదు, గుణంలేదు. శివరాత్రి అంటే శివుడు లింగరూపంధరించినరోజు. ఆకారం లేని వాడిని మనం ఆరాధించలేము. అందువలన పరమేశ్వరుడు ఒకడు ఉన్నాడు అని గుర్తుకోసం లింగరూపంధరించాడు. తొలిలింగం, ఆదిలింగం, అరుణాచలలింగం. శివుడు నిర్గుణుడు అంటే గుణములు లేనివాడు. గుణములు కలిగినవాడు జీవుడు. గుణములులేనివాడు శివుడు. శివుడు ఆనందస్వరూపుడు, జ్ఞానస్వరూపుడు. శివానుగ్రహం లేకపోతే నీకుజ్ఞానం కలుగదు. జ్ఞానం కలుగకపోతే నీకు మోక్షం కలుగదు. శివుడు జ్ఞానమును ఇస్తాడు, విష్ణువు మోక్షమును ఇస్తాడు అని పెద్దలు చెపుతారు. శివుడు, విష్ణువు అంటే రూపంలో తేడాకాని మూలంలో ఒక్కటే. ఇక్కడ మాయలో పడకూడదు. జ్ఞానం అన్నా, మోక్షం అన్నా ఒక్కటే. మోక్షం జ్ఞానగమ్యం.

కేవలము మీరు బొమ్మలను ఆరాధించటమే కాదు గురువు చెప్పిన మాటలను ధ్యానం చేసినా మీకు జ్ఞానం కలుగుతుంది. రూపాలను ధ్యానం చేయటమేకాదు. భగవంతుడు చెప్పిన మాటలను ధ్యానం చేయటం వలన వివేకం కలుగుతుంది. ఆ మాటలను ధ్యానం చేయటం వలన మీకు చివరిస్థితి కలుగుతుంది. ఇప్పుడు మీకు అందరికి శరీరాలు ఉన్నాయి. కొంతకాలం తరువాత చూస్తే ఇవి శూన్యం అయిపోతాయి. మీకు డబ్బు ఉంది అనుకోండి. శరీరం ఉండగా డబ్బు పోవచ్చును, డబ్బు ఉండగా శరీరం పోవచ్చును. పెళ్ళిళ్ళు చేసుకొంటున్నారు. భార్య ఉండగా భర్త పోవచ్చును, భర్త ఉండగా భార్య పోవచ్చును. అలాగే గౌరవాలు వస్తూఉంటాయి, పోతూఉంటాయి. ఇవి అన్నీ కూడా శూన్యం అయిపోతాయి. ఈ సృష్టిలో శూన్యంకానిది చైతన్యం ఒక్కటి మాత్రమే అంటున్నారు ఆచార్యులవారు. దేహం ఉన్నా, దేహం లేకపోయినా, నీకు ధనం ఉన్నా ధనం లేకపోయినా, అధికారం ఉన్నా అధికారం లేకపోయినా ఒకటి నిరంతరం మీకు నేనుగా వ్యక్తమవుతోంది. అలా నేనుగా ఏదైతే వ్యక్తమవుతోందో అది శూన్యంకాదు. మీకు సుఖంరావచ్చును, కష్టంరావచ్చును. మంచిరావచ్చును, చెడురావచ్చును ఏది వచ్చినా ఏది పోతున్నా మీకు ఒకటి మాత్రం నేనుగా వ్యక్తమవుతోంది. ఆ నేనుగా వక్తమయ్యేది మాత్రం ఎన్నడూ శూన్యంకాదు. మీ అనుభవంలో చూసుకోండి. మీకు కష్టం వచ్చినప్పుడు, మీకు సదుపాయములు వచ్చినప్పుడు కూడా అది నేనుగా వ్యక్తమవుతోంది. అది ఎప్పుడూ శూన్యం కాదు. అదే చైతన్యం, అదే ఆత్మ, అదే బ్రహ్మం.

ఎవడైతే నిరంతరము పరమేశ్వరుడిని ఆరాధిస్తున్నాడో వాడికి రెండుదుఃఖములు నశిస్తాయి. 1) దారిద్ర్యంవలన వచ్చే దుఃఖం 2) సంసారం వలన వచ్చే దుఃఖం. గురువు చెప్పిన మాటలను శ్రవణంచేసి, ఆమాటలను ధ్యానం చేసి వాటి అర్థాన్నిగ్రహిస్తే దుఃఖం అంతా మూలంతో సహా నశిస్తుంది అంటున్నారు ఆచార్యులవారు సబ్జక్టు సరిగా అర్థమయితే 100 కి 80 మార్కులు సంపాదించినట్లే. మీరు చేసే సాధనలు అన్నీ మిగిలిన 20 మార్కులు సాధించటానికే. అందువలన సబ్జక్టును సరిగా అర్థం చేసుకోవటంలోనే చాలాదూరం వెళ్ళి పోతారు. Subject నీకు Proper గా అర్థమయితే ఇప్పుడే ఇక్కడే దుఃఖం నశిస్తుంది. కొంతమంది వారిలో

ఉన్న బలహీనతలను చూసుకోరు. ఎదుటివారిలో ఉన్న బలహీనతలను చూస్తూ ఉంటారు. ఎదుటివారిలో ఉన్న లోపములను తలపెట్టుకోవటం వలన మీరు అపవిత్రులు అవుతారు, జ్ఞానమునకు దూరమవుతారు. మూలంలో నశిస్తారు అని భారతంలో చెప్పారు.

పూజవలనగాని, జపంవలనగాని, ధ్యానంవలనగాని వేరుబుద్ధినశించకపోతే నీకు జ్ఞానం రాదు. నేను పూజచేసాను, జపంచేసాను, ధ్యానంచేసాను అన్నంతమాత్రంచేత నీకు జ్ఞానంరాదు. నీలో ఉన్న వేరుబుద్ధి నశించకపోతే కోటిజన్మలు ఎత్తి ఇలా పూజలు, జపాలు, ధ్యానాలు చేసినా నీకు మోక్షంరాదు. పూజ, జపం, ధ్యానం చేయకపోతే దేవుడు ఎలా తెలుస్తాడు అని అడుగుతున్నారు. Subject ను Proper గా అర్థంచేసుకోవాలి. ఇవి అన్నీ చేయవద్దు అని చెప్పటంలేదు. ఇవి చేయటం వలన నీలో ఉన్న వేరుబుద్ధి నశించాలి. నీకు రోగం వచ్చింది అనుకో. మందులువాడతావు. మందులు వాడటం వలన రోగం తగ్గవచ్చు, తగ్గకపోవచ్చును. రోగం తగ్గటం వలన ఆరోగ్యం వస్తుందిగాని మందులు వాడటంవలన ఆరోగ్యం రాదు. అలాగే నీలో ఉన్న వేరుబుద్ధి నశిస్తే నీకు జ్ఞానం కలుగుతుందిగాని కేవలము జపంచేసాను, ధ్యానంచేసాను, నాకు జ్ఞానంకావాలి అంటే పరమేశ్వరుడు ఇవ్వడు.

మన మనస్సులో మృదుత్వం లేదు. బండతనంగా ఉంటాము. మనస్సులో ఉన్న బండతనం పోవాలి. భక్తి ఉంటే మనస్సులో ఉన్న బండతనం పోతుంది. ఆశ నశిస్తే మనస్సు నశిస్తుంది. మనస్సు నశిస్తే జీవుడు దేవుడు అవుతాడు. మన హృదయంలో పరమేశ్వరుడు ఉన్నాడు. కాని ఆయన మనకు దొరకటంలేదు. మన భక్తి నిర్మలంగా ఉండాలి, ధ్యానం నిశ్చలంగా ఉండాలి, కర్మనిష్కామంగా ఉండాలి. ఇలా ఉంటే నీలోపల ఉన్న పరమేశ్వరుడు నీకు వ్యక్తమవుతాడు. పనిచేస్తే మనకు గుర్తింపు కావాలి. ఎంత చేసినా గుర్తింపులేదు అంటారు. గుర్తింపులు కోరుకోవటంవలన నీవు ఏ నేనును అయితే పోగొట్టుకోవాలి అనుకొంటున్నావో ఆ నేను పెరిగిపోతుంది. మన భక్తి ఎలా ఉంది అంటే ఒక దేవుడిని పట్టుకొంటాము. కోరికలు నెరవేరకపోతే వాడిని వదిలి వేసి ఇంకో దేవుని పట్టుకుంటాము. మరలకోరికలు నెరవేరకపోతే ఆ దేవుని మార్చేస్తాము. దీనిని వ్యభిచార భక్తి అంటారు. పరమేశ్వరుడిని ధ్యానం చేస్తే పరమేశ్వరుడు వ్యక్తమవుతాడు. కోరికను ధ్యానం చేస్తే కోరిక నెరవేరుతుందిగాని పరమేశ్వరుడు వ్యక్తంకాడు. కోరికనెరవేరింది అనుకో దాని వలన వచ్చే ఫలితమును Enjoy చేస్తే అది పోతుంది. కర్మఫలమును అనుభవించేటప్పుడు అది నీ మనస్సును బాహ్యముఖానికి గెంటివేస్తుంది కాని నీ హృదయంలో ఉన్న పరమేశ్వరుని వైపుకు తిరగనివ్వదు.

ఏ గురువును ఆరాధించినా, ఏ దేవుని ఆరాధించినా ప్రకృతిగుణాలు దాటితే గాని జ్ఞాని కాలేడు. నీ లోపల ఆత్మ ఉన్నప్పటికీ అది ఎందుకు నీకు తెలియబడటం లేదు అంటే నీకు ఆత్మతో తాదాప్యం లేదు. ఆత్మకాని దానితో తాదాప్యం చెందుతున్నావు దీనికి ఎవరో ఇతరులు కారణంకాదు. నీ అజ్ఞానమే దీనికి కారణం. మీరు ఋణం చేసి చనిపోయారు అనుకోండి. మీ పిల్లలు మీరు చేసిన ఋణాన్ని తీర్చవచ్చును కాని మీ అజ్ఞానమును తొలగించలేరు. గురువును ఆశ్రయించి మీ అంతట మీరే ప్రయత్నం చేసి ఈ శరీరం ఉండగానే మీ అజ్ఞానమును తొలగించుకోవాలి గాని ఇతరులు ఎవరూ దీనిని తొలగించలేరు. ఇప్పుడు మనం అందరమూ పుట్టాము. ఎక్కడ పుట్టాము? దేహంలో పుట్టాము. దేహంలో పుట్టాను అనుకున్నంతకాలం ఇలా పుడుతూనే ఉంటావు. చనిపోతూనే ఉంటావు. నీవు ఆత్మలో పుట్టేవరకూ ఈ చావు పుట్టుకలు తప్పవు. నీవు ఆత్మలో పుట్టాక ఇంక తిరిగి పుట్టనక్కరలేదు. ఎందుచేతనంటే దానికి పుట్టుక లేదు. చావులేదు. పంచభూతములు, ఈ సృష్టి వచ్చాక మనం వచ్చాము. పంచభూతములు, ఈ సృష్టిలేనప్పుడు కూడా ఏ వస్తువు అయితే ఉందో అదే ఆత్మ.